# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-01-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ప్రపంచంలోనే మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మారనుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటించారు.**

**2.** **బడ్జెట్ సమావేశాల్లో అర్థవంతమైన చర్చకు ప్రతిపక్షాలు సహకరించాలని, వికసిత్ భారత్‌కు ఈ బడ్జెట్ ఊతమిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.**

**3.** **పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టువస్త్రాలు సమర్పించారు.**

**4.** **రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ ద్వారకా తిరుమలరావు పదవీ విరమణ వీడ్కోలు పరేడ్ ఘనంగా జరిగింది.**

**5** **అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో మూడు రోజులపాటు జరగనున్న చలి ఉత్సవాలను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఈ రోజు ప్రారంభించారు.**

==========================

ప్రపంచంలోనే మూడవ పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మారనుందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్ఘాటించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి ఆమె ఈ రోజు ప్రసంగించారు. ప్రభుత్వం మూడు రెట్ల వేగంతో పనిచేస్తూ, కొత్త పథకాలు వేగవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ఒకే దేశం-ఒకే ఎన్నికలు, వక్ఫ్ బోర్డు తదితర సాహసోపేత నిర్ణయాలు తీసుకుందని వెల్లడించారు. యువతకు ఉద్యోగాల కల్పన, మహిళా సాధికారత దిశగా చర్యలు చేపట్టామని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వివరిస్తూ...

వాయిస్ ( 43 సెకన్స్)

-------------------------

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాత్రికేయులతో మాట్లాడారు. ఈ బడ్జెట్ ప్రజల్లో కొత్త విశ్వాసం నింపుతుందని ఆయన భరోసా ఇచ్చారు. బడ్జెట్ సమావేశాల్లో అన్ని అంశాలపై చర్చ జరగాలని ఈ సందర్భంగా ప్రధానమంత్రి అన్నారు. దేశంలోని పేద, మధ్య తరగతి ప్రజలపై లక్ష్మీదేవి కరుణ చూపాలని ఆకాంక్షించారు. బడ్జెట్ సమావేశాల్లో అర్థవంతమైన చర్చకు ప్రతిపక్షాలు సహకరించాలని, వికసిత్ భారత్ కు ఈ బడ్జెట్ ఊతమిస్తుందని నరేంద్ర మోదీ తెలియజేస్తూ...

వాయిస్ ( 37 సెకన్స్)

-------------------------

బడ్జెట్ సమావేశాల్లో భాగంగా 2024-25 ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఈ రోజు లోక్‌సభలో ప్రవేశపెట్టారు. పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగం పూర్తయిన తర్వాత ఆమె ఆర్థిక సర్వేను సభ ముందు ఉంచారు. అనంతరం స్పీకర్ ఓం బిర్లా సభను రేపటికి వాయిదా వేశారు. నిర్మలా సీతారామన్ రేపు కేంద్ర బడ్జెట్‌ను సమర్పించనున్నారు.కేంద్ర బడ్జెట్ సమర్పణకు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది.

---------------------------

పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం పెనుగొండలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం ఈ రోజు అధికారికంగా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు పెనుగొండ చేరుకున్న ముఖ్యమంత్రికి పలువురు, మంత్రులు, శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. అనంతరం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయానికి చేరుకున్న చంద్రబాబు నాయుడు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన వాసవీ ధామ్‌లో నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు.

---------------------------

రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ ద్వారకా తిరుమలరావు పదవీ విరమణ వీడ్కోలు పరేడ్‌ను విజయవాడలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. తన జీవితంలో ఇవి ఉద్విగ్నభరిత క్షణాలని తెలిపారు. యూనిఫామ్ ఇకపై ఉండదంటేనే భావోద్వేగంగా ఉందని చెప్పారు. సర్వీసులో చేరినప్పటి నుంచి అనేక సవాళ్లు ఎదుర్కొన్నానని.. సంప్రదాయ పోలీసింగ్ నుంచి సాంకేతిక పోలీసింగ్ వైపు మారామని ద్వారకా తిరుమలరావు తెలుపుతూ.ఈ సందర్భంగా నూతన డీజీపీ హరీశ్ కుమార్‌గుప్తా మాట్లాడుతూ.. తిరుమలరావు పోలీసు శాఖలో చెరగని ముద్రవేశారని కొనియాడారు. ప్రజల భద్రత, రక్షణ కోసం అనేక సంస్కరణలు చేపట్టారని గుర్తు చేసుకుంటూ...

వాయిస్ (41 సెకన్స్)

---------------------------

రథసప్తమి సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించేందుకు తిరుమలలోని అన్నమయ్య భవనంలో తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సమావేశమైంది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్యక్షతన మండలి సభ్యులు ఈ రోజు సమావేశమయ్యారు. ఫిబ్రవరి 4వ తేదీన రథసప్తమి రోజు చేపట్టవలసిన ఏర్పాట్లు, భక్తుల రద్దీకి అనుగుణంగా తీసుకోవలసిన చర్యలపై చర్చిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీవారి భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, సదుపాయాలపై టీటీడీ ఛైర్మన్ అధికారులకు పలు సూచనలు చేశారు.

---------------------------

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో చలి ఉత్సవాలు నేటి నుంచి ఆదివారం వరకు జరగనున్నాయి. ఈ ఉదయం మారథాన్ పోటీలతో ఈ ఉత్సవాలను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ప్రారంభించారు. మారథాన్ పోటీల్లో యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్సవాలకు వేలాదిమంది తరలివస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉత్సవాల్లో ఏడు రాష్ట్రాల్లోని గిరిజన కళాకారులు వారి కళలను ప్రదర్శించనున్నారు. సాహస ఔత్సాహికుల కోసం పారా గ్లైడింగ్, హాట్ ఎయిర్ బెలూన్, హెలికాప్టర్ రైడ్ నిర్వహిస్తున్నారు.

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తిరుపతిలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో

పాల్గొన్నారు. తిరుపతి పడమర రైల్వేస్టేషన్ వద్ద 1500 మంది సామర్థ్యం గల రైల్వే కళ్యాణ మండపం నిర్మాణానికి ఆయన ఈ రోజు శంకుస్థాపన చేశారు. అలాగే తిరుపతి అంతర్జాతీయ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం  అరుణ్ కుమార్ జైన్ పాత్రికేయులతో మాట్లాడుతూ తిరుపతి అంతర్జాతీయ రైల్వేస్టేషన్ పనులు వేగంగా జరుగుతున్నాయని..అతి త్వరలోనే ప్రయాణికులకు అందుబాటులోకి  తీసుకొస్తామని  తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి వి. ఎస్.ఎన్ రాజు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ  కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 21 సెకన్లు....

---------------------------

విజయవాడలోని పాస్ పోర్ట్ సేవా కేంద్రంలో రోజుకు     50 అదనపు స్లాట్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి శివహర్ష తెలిపారు. జనవరిలో ప్రయోగాత్మకంగా ప్రతి బుధవారం 250 అదనపు స్లాట్లను పెంచి అమలు చేశామని, ఫిబ్రవరిలోనూ దీనిని కొనసాగిస్తామని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో భర్తీ చేయనున్న 6 వేల 100 పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు 39 వేల మంది దేహదారుఢ్య, శారీరక సామర్థ్య పరీక్షల్లో అర్హత సాధించారు. ప్రాథమిక పరీక్షలో అర్హత సాధించిన 95 వేల మందికి రాష్ట్ర వ్యాప్తంగా గత నెల 30వ తేదీ నుంచి నిన్నటి వరకు పోలీసు నియామక మండలి ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో దేహదారుఢ్య, శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించింది. అర్హత సాధించిన 39 వేల మంది అభ్యర్థులకు మార్చి చివరి వారం లేదా ఏప్రిల్ మొదటి వారంలో తుది రాత పరీక్షలు నిర్వహిస్తామని పోలీస్ నియామక మండలి చైర్మన్  ఎం.రవి ప్రకాశ్ తెలిపారు.

======================